## క్లుప్తంగా

### ఖేలో ఇండియా పోటీల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): ఉషా ఖేలో ఇండియా పోటీల్లో క్రీడాకారులు రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి ఉషా మహిళల ఖేలో ఇండియా పోటీలు నిర్వహించారు. పోటీలను జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఖేలో ఇండియా క్రీడా పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

### గిట్టుబాటు వేతనం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): బీడీ కార్మికులు, డీసీఎల్‌ల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు వెయ్యి బీడీలకు రూ.200 వేతనం ఇవ్వాలని బీడీ యూనియన్ రాష్ట్ర కో–కన్వీనర్ పి.ఇక్బాల్ హుస్సేన్, రాష్ట్ర నాయకులు సుధాకరప్ప, రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి కార్మికులు, యజమానుల మధ్య ఒప్పందాలు జరగాలన్నారు. ప్రస్తుతం కార్మికులకు ఇస్తున్న వేతనం సరిపోవడం లేదని, వెయ్యి బీడీలకు రూ.220 వేతనం ఇవ్వాలని కోరారు.

### బాధ్యతల స్వీకరణ



సీఎస్ విజయ్‌కుమార్‌ను కలిసిన సిబ్బంది

కర్నూలు సిటీ: జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ కార్యాలయంలో సీనియర్ స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తున్న సీఎస్ విజయ కుమార్‌కు సూపరింటెండెంట్‌గా ఇటీవలే పదోన్నతి కల్పిస్తూ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి రెండు రోజుల క్రితం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్‌ఈని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆ తరువాత ఆఫీస్ సిబ్బంది విజయ కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

### సంయుక్త కార్యదర్శిగా నాగేంద్రబాబు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా విభాగం సంయుక్త కార్యదర్శిగా కర్నూలు అసెంబ్లీ నియోజక వర్గానికి చెందిన పి.నాగేంద్రబాబు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

### రోగుల సహాయకుల కోసం శాలమ్మ సత్రం

- అందుబాటులో 29 గదులు
- రోజుకు అద్దె రూ.150

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగుల సహాయకుల వసతి కోసం ఆసుపత్రి ఎదురుగా ఉన్న శాలమ్మ సత్రాన్ని ఉపయోగించుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. రోగుల సహాయకులకు వసతి కల్పించాలన్న ఉద్దేశంతో శాలమ్మ సత్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. రోజుకు కేవలం రూ.150 నామమాత్ర రుసుము చెల్లించి ఇందులో వసతి పొందవచ్చన్నారు. ఇందుకోసం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగి అడ్మిషన్ కేస్‌షీట్, ఆధార్ నంబర్ తీసుకొని వెళితే గది కేటాయిస్తారన్నారు. వసతి గృహంలో 29 గదులు ఉన్నాయని, అందులో కేవలం నాలుగైదు మాత్రమే ప్రతిరోజూ భర్తీ అవుతున్నాయని, ఆసుపత్రిలో రోజుల తరబడి అడ్మిషన్‌లో ఉన్న రోగుల సహాయకులు ఈ సత్రంలోని వసతి గదులను ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

**5న విశ్రామ్ సదన్‌కు శంకుస్థాపన**

రోగుల సహాయకులకు వసతి కల్పించేందుకుగాను రూ.14.15 కోట్లతో ఆసుపత్రిలో విశ్రామ్ సదన్ పేరుతో అన్ని వసతులతో కూడిన విశ్రాంతి భవనం నిర్మించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ వ్యయం మొత్తాన్ని భరించేందుకు సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేసే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు ముందుకొచ్చారన్నారు. 150 పడకల సామర్థ్యంతో నిర్మితమయ్యే ఇందులో రోగుల సహాయకుల నుంచి స్వల్ప మొత్తాన్ని రుసుముగా వసూలు చేస్తారన్నారు. దీనిని ఆస్పత్రిలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు పక్కనున్న ఖాళీ స్థలంలో నిర్మించనున్నట్లు తెలిపారు.

### సీపీఐ నగర మాజీ కార్యదర్శి మృతి

కర్నూలు(సెంట్రల్): సీపీఐ నగర మాజీ కార్యదర్శి గోవిందు అకాల మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందిన గోవిందు మృతదేహంపై అరుణ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి సీపీఐ నాయకులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై విస్తృత పోరాటం సాగించిన ఘనత గోవిందుకు దక్కుతుందన్నారు. ఆయన మరణం సీపీఐకి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# విధుల్లో వాటర్ వర్క్స్ ఇన్‌చార్జ్ విఫలం

- ఇంజనీరింగ్ విభాగంలో పలువురికి స్థానభ్రంశం
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ పి.విశ్వనాథ్



నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): గతంలో ఏన్నడూ లేని విధంగా మంచి నీళ్లు ఇవ్వడంటూ నగరపాలక సంస్థ కమిషనర్ ఇంటి వద్ద వివిధ కాలనీలకు చెందిన ప్రజలు ధర్నాలు చేశారు. నగరంలో ఎలాంటి నీటి సమస్య లేదు. సుంకేసులలో, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీరు ఉన్నాయి. సరఫరా చేయడంలో వైఫల్యం వల్లే ప్రజలకు నీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. అప్పటికే కమిషనర్ సంబంధిత వాటర్ వర్క్స్ ఇన్‌చార్జ్‌కి మంచినీటి సరఫరాలో అలసత్వం లేకుండా చూడాలని చెప్పారు. అయినా సదరు అధికారి తన కు సంబంధం లేనట్లుగా వ్యవహరించారు. అలాగే కర్నూలు నగరం మొత్తం మంచినీటి సరఫరా నిలిచిపోయి ప్రధాన పైపులైన్ పనులు రాత్రనక, పగలనక జరుగుతుంటే అటువైపు వెళ్లడం, పర్యవేక్షణ చేయకపోవడంతో సదరు అధికారి మాటలే తప్ప.. చేతలు లేవని పేర్కొంటూ కమిషనర్ శుక్రవారం నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో పలువురికి స్థానభ్రంశం కల్పించారు. ఎవరికి ఏ బాధ్యతలు కావాలో చెప్పండి. వాటినే అప్పగిస్తా. తీసుకున్న విధుల్లో బాధ్యతాయుతంగా పనిచేయాల్సి ఉంటుంది. ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

**వాటర్ వర్క్స్ అధికారి విధుల్లో కోత**

విధి నిర్వహణలో సక్రమంగా పనిచేయకపోవడంతో సదరు వాటర్‌వర్క్స్ ఇన్‌చార్జ్ విధుల్లో కోత విధించారు. ప్రధానమైన కల్లూరు, కోడుమూరు ఏరియాలను తప్పించారు. బాధ్యతలను ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మనోహర్ రెడ్డికి అప్పగించారు. అలాగే పార్కులు, జంక్షన్లు, మీడియన్స్, వాహనాల నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, వార్డుల్లో జరిగే అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

**శానిటేషన్‌లోనూ అంతర్ బదిలీలు**

నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు అంతర్ బదిలీలు చేస్తూ కమిషనర్ పి.విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. 9వ డివిజన్‌లో పనిచేసే బి.అనిల్ కుమార్‌ను 1వ డివిజన్‌కు, మల్లికార్జునను 3వ డివిజన్ నుంచి 2వ డివిజన్‌కు, ముర్తుజావలీని 5వ డివిజన్ నుంచి 4వ డివిజన్‌కు, మునిస్వామిని 8వ డివిజన్ నుంచి 7వ డివిజన్‌కు, జి.రమేష్‌బాబును 6వ డివిజన్ నుంచి 8వ డివిజన్‌కు, లోకేష్‌ను 1వ డివిజన్ నుంచి 9వ డివిజన్‌కు, శివశంకర్‌ను 2వ డివిజన్ నుంచి 11వ డివిజన్‌కు ఏ.ఎస్.రవిని 11వ డివిజన్ నుంచి 16వ డివిజన్‌కు, యువరాజ్‌ను 7వ డివిజన్ నుంచి డంప్ యార్డుకు బదిలీ చేశారు.

# శ్రావణ మాసం సేల్ పేరుతో సైబర్ మోసాలు

- అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచన



ఎస్పీ విక్రాంత్ పాటిల్ (ఫైల్)

కర్నూలు: శ్రావణ మాసం సేల్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. ఆకర్షణీయమైన ఆఫర్లు, డిస్కౌంట్ల పేరుతో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లను కూడా పట్టించుకోరాదని సూచించారు. ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండొచ్చన్నారు.

**జాగ్రత్తలు ఇవీ..**

- ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్ల పేరుతో వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదు. వాటి ద్వారా మీ వ్యక్తిగత సమాచారం తస్కరించే అవకాశముంది.
- తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లలో బ్యాంకు వివరాలు, ఓటీపీల వంటి వ్యక్తిగత సమాచారం కోరితే పట్టించుకోకూడదు.
- ఏదైనా ఆఫర్ గురించి తెలుసుకోవాలనుకుంటే అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే సంప్రదించాలి.
- ఏదైనా కొనుగోలు చేసేముందు ఆఫర్ నిజమైనదేనా అని కచ్చితంగా ధ్రువీకరించుకోవాలి.
- పాస్‌వర్డ్‌లను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ సురక్షితంగా ఉంచుకోవాలి.
- తెలియని ఫోన్ కాల్స్, ఓటీపీల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైం 1930 హెల్ప్‌లైన్ నెంబర్, www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి.
- సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతుంటారు కాబట్టి జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

# కేఎంసీలో ర్యాగింగ్ కలకలం



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రెండవ పట్టణ ఎస్‌ఐ మల్లికార్జున, హాజరైన అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. మూడవ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులను ర్యాగింగ్ చేశారని కొందరు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు శుక్రవారం సాయంత్రం రెండవ పట్టణ పోలీసులు కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కళాశాలలో, వసతి గృహంలో ఎలాంటి ర్యాగింగ్, ఇతర నేరపూరిత చర్యలు చేయకూడదన్నారు. అలాగే ర్యాగింగ్ విషయమై కళాశాల ఉన్నతాధికారులతో చర్చించారు. ర్యాగింగ్ జరగకుండా చూసే బాధ్యత కళాశాల అధికారులపై ఉందని వారు చెప్పడంతో సాయంత్రం యాంటీ ర్యాగింగ్ కమిటీని ఉన్నఫలంగా ప్రకటించారు. వినాయక చవితి పండుగ వస్తున్నందున ఎప్పటిలాగే ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థులను మూడవ సంవత్సరం విద్యార్థులు చందాలు అడిగారని, ఇలా చందాలు ఇవ్వడం ఇష్టం లేని కొందరు విద్యార్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. చందాలు కోరడం కూడా ర్యాగింగ్‌గా భావించి ఫిర్యాదులు చేస్తే ఎలాగని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

**యాంటీ ర్యాగింగ్ కమిటీ**

కర్నూలు మెడికల్ కాలేజీలో యాంటి ర్యాగింగ్ కమిటీ ఏర్పాటైంది. కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, కన్వీనర్‌గా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, సభ్యులుగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సింధియా శుభప్రద, డాక్టర్లు శ్రీరాములు, బాలీశ్వరి, వాణిశ్రీ, రామకృష్ణ నాయక్, సలీమ్‌బాషా ఉన్నారు. కాలేజీ హాస్టల్‌లో జూనియర్ విద్యార్థులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులకు నేరుగా గానీ, ఫోన్‌లో గానీ ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు.

# మూడు పెళ్లిళ్ల విద్యుత్ ఉద్యోగి

- మధుభాస్కరరావు నిర్వాకంపై ఇద్దరు భార్యల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగిన భాస్కరరావు మొదటి, రెండవ భార్యలు

కర్నూలు(సెంట్రల్): ఆయన పేరు కరణం మధుభాస్కర రావు. పత్తికొండ ఎలక్ట్రిసిటీ కార్యాలయంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్. ఇప్పటికే ఇద్దరు భార్యలు ఉండగా.. ఇటీవల మూడో పెళ్లి చేసుకోవడంతో మొదటి ఇద్దరు భార్యలు న్యాయం చేయాలని కోరుతూ రోడ్డెక్కారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మొదటి భార్య రాధాలక్ష్మి మాట్లాడుతూ తనకు కరణం మధుభాస్కర రావుతో 1993లో వివాహమైందన్నారు. ఒక కూతూరు సంతానం అని, అయినప్పటికీ 2002లో కడపకు చెందిన పద్మావతిని వివాహం చేసుకున్నాడన్నారు. అప్పటి నుంచి కుమార్తెతో కలిసి తన తండ్రి పార్థసారథి దగ్గర ఉంటున్నట్లు వాపోయారు. ఆయన విడాకుల కోసం నోటీసులు ఇచ్చినా పరిష్కారం కాలేదని, తనకు రూ.80 లక్షలు ఇస్తానని చెప్పి మోసం చేస్తున్నాడని ఆరోపించారు. రెండో భార్య పద్మావతి మాట్లాడుతూ 2002 నుంచి ఇప్పటి వరకు తనతో కాపురం చేసిన మధుభాస్కరరావు క్రమంగా దూరమవుతూ వచ్చాడన్నారు. కర్నూలు డివిజన్ కార్యాలయంలో పనిచేసే అటెండర్ శాంతి(వితంతు)తో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని, ఈ విషయాన్ని తెలుసుకున్న తాను ఆదివారం ఇద్దరూ కలసి ఉన్న సమయంలో 100కు ఫోన్ చేసి తెలిపానన్నారు. పోలీసులు వచ్చి పట్టుకున్నారని, అయితే ఆ సమయంలో తనకు శాంతితో రిజిస్టర్ వివాహం జరిగినట్లు చెబుతున్నాడన్నారు. అంతేకాక ఆయన మొత్తం ఆస్తి శాంతి 28 ఏళ్ల కూతూరు, 26 ఏళ్ల కుమారుడికి చెందుతుందని చెప్పడం దారుణమన్నారు. వెంటనే ఆ వివాహనాన్ని రద్దు చేయాలని కోరారు. తనకు ఒక కూతూరు ఉందని, మొదటి భార్యకు ఒక కూతూరు ఉందని.. వీరిని కాదని మొత్తం ఆస్తిని మూడో భార్యగా చెప్పుకునే శాంతికి, ఆమె సంతానానికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వెంటనే తమ భర్త మూడో వివాహాన్ని రద్దు చేసి తమ ఇద్దరి సంతానికి ఆస్తిలో వాటా వచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే తమ పిల్లల భవిష్యత్ అంధకారం అవుతుందని వాపోయారు.

### పగల'బడి' నవ్వుతున్న ఆంక్షలు!

కర్నూలు సిటీ: నవ్విపోదురు గాక మాకేంటి సిగ్గు అన్నట్లు పాఠశాలలో ప్రవేశంపై ఆంక్షలు విధిస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ విజయ రామరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల పేరెంట్స్, ఎస్ఎంసీ సభ్యులు మినహా ఇతరులు పాఠశాలల్లో ప్రవేశం చేయకూడదని ఆంక్షలు విధించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులతోనూ ప్రకటనలు చేయించారు. గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి ఆంక్షలు విధించిన ప్రభుత్వాన్ని చూడలేదని ఉపాధ్యాయ వర్గాలు, విద్యార్థి సంఘాలు అభిప్రాయ పడుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కార్ స్కూళ్లను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దింది. కూటమి ప్రభుత్వం ఏడాదిగా ప్రభుత్వ పాఠశాలల్లో 'నాడు- నేడు' పనులను నిలిపివేసింది. ప్రజల నుంచి ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతోనే విద్యాశాఖ చరిత్రలో ఎప్పుడు కూడా లేని విధంగా పాఠశాలలలో ప్రవేశంపై ఆంక్షలు విధించడం చర్చనీయాశంగా మారింది. విద్యార్థులు పడే అసౌకార్యాలను, ఇబ్బందులపై ప్రతిపక్ష, ప్రజా, విద్యార్థి సంఘాలు వెలికి తీస్తుండడంతో ఈ ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

### జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు ఇవ్వడం లేదని, మూడు నెలలకోసారి పాత అక్రిడేషన్ల గడువు పొడిగిస్తూ వస్తోందని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈఎన్ రాజు, కె.శ్రీనివాసగౌడ్ విమర్శించారు. వారు శుక్రవారం మాట్లాడుతూ.. ఆగస్టు 5న జర్నలిస్టుల డిమాండ్స్ డేగా సందర్భంగా తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. జర్నలిస్టులకు అక్రిడేషన్లతో పాటు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బయ్య, జిల్లా సలహాదారు కృష్ణారెడ్డి, ఐజేయూ జాతీయ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

### రోజా దర్గా భూమి అన్యాక్రాంతం

కర్నూలు(అర్బన్): కర్నూలులోని సయ్యద్ ఇషాక్‌సనుల్లా ఖాద్రి అలియాస్ సయ్యద్ ఖాద్రి మియా సాహెబ్ (ఆర్‌హెచ్) రోజా దర్గాకు సంబంధించి సర్వే నంబర్ 218లోని 19.65 సెంట్ల భూమి అన్యాక్రాంతమైనట్లు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ముక్తార్ బాషా తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు.. కల్లూరు పరిధిలోని ముజఫర్‌నగర్ ప్రాంతంలో ఉన్న ఈ భూమిని క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ భూమి వెంచర్ ప్లోటింగ్ అయ్యిందని, ఆక్రమణ, అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు కూడా జరిగినట్లు తమ పరిశీలనలో తెలిసిందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాగే జిల్లా కలెక్టర్ ద్వారా ఆర్‌డీఓ, జిల్లా రిజిస్ట్రార్‌కు నివేదికలు అందించామన్నారు. భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### జిల్లాకు మంచి పేరు తేవాలి

కర్నూలు (టౌన్): క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు మంచి పేరు తేవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సూచించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు మైదానంలో మాత్రమే ప్రత్యర్థులతో తలపడాలని, మైదానం వీడిన తరువాత స్నేహితులుగా మెలగాలన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ హర్షవర్ధన్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అండర్ 14 నుంచి అండర్ – 20 వరకు బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు బాపట్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

### రేషన్ బియ్యం వ్యాపారాన్ని అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలుకు వచ్చిన పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడుకు టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన బియ్యాన్ని కొందరు వ్యాపారులు గోదాముల్లో దాచుకొని అక్రమంగా వ్యాపారం చేయడం భావ్యం కాదన్నారు. వారికి ప్రజాప్రతినిధుల అండ ఉండడం దుర్మార్గమన్నారు. అలాంటి నిల్వలపై అధికారులు దాడులు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, రాజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

### నవలా పురస్కారానికి ఎంపిక

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లాకు చెందిన డైట్ కళాశాల అధ్యాపకుడు, రచయిత మారుతి పౌరోహితం రాసిన 'ప్రణయ హంపి' నవల ప్రతిష్టాత్మక శివేగారి దేవమ్మ నవలా పురస్కారం –2024కు ఎంపికైంది. ఈ మేరకు నిర్వాహకులు ప్రకటన విడుదల చేశారు. కథా రచయితగా యాసలో, ప్రాంతీయ మండలికంలో కాలువ కథను రాశారు. 2022లో ఊరిమర్లు కథా సంపుటిని తీసుకొచ్చారు. అందులో ఊరిమర్లు కథకు తెలుగు తల్లి కెనడా అవార్డు, తాతారావు, అలియాస్ రజినీకాంత్ అనే కథకు తెలుగు తల్లి కెనడా అవార్డు రెండోసారి అందుకున్నారు. కుశలంబేగదా ఆంజనేయ కథకు ఖమ్మం ఈస్తటిక్స్ అవార్డు లభించింది. 2023లో హాసిని రామచంద్ర పురస్కారం అందుకున్నారు. నీళ్లింకని నేల తెలుగు సాహిత్యంలో సంచలనంగా నిలిచింది. పురస్కారానికి ఎంపికైన మారుతికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# రెండు నెలల శిశువు కడుపులో కణితి

కర్నూలు(హాస్పిటల్): పుట్టగానే 4.5 కిలోల బరువుతో జన్మించాడు. బాలభీముడని తల్లిదండ్రులు సంబరపడ్డాడు. కానీ అది కడుపులో కణితి వల్ల అని కొద్దిరోజుల్లోనే తెలిసి తల్లడిల్లిపోయారు. వెంటనే వైద్యులను సంప్రదించి పిల్లాడు పడుతున్న ఇబ్బందులు చెప్పడంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి విజయవంతంగా కణితి తొలగించారు. వివరాలను శుక్రవారం స్థానిక నంద్యాల రోడ్డులోని సాయిమేఘ హాస్పిటల్‌లో చిన్నపిల్లల వైద్యుడు అమరనాథ్‌రెడ్డి వివరించారు. డోన్ మండలం దొరపల్లెకు చెందిన సుమిత్ర, రవి దంపతులకు జన్మించిన రెండు నెలల బాలునికి కడుపునొప్పి రావడంతో ఇటీవల సాయిమేఘ హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యులు బాలునికి స్కానింగ్ చేసి కడుపులో కణితి ఉన్నట్లు నిర్ధారించారు. ఆ బాలునికి చిన్నపిల్లల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కృష్ణనాయక్ ఆధ్వర్యంలో అనెస్తీషియా వైద్యులు డాక్టర్ కాంచన, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ అమరనాథ్‌రెడ్డి సహకారంతో 4 గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి కడుపులో ఉన్న కణితి తొలగించారు. ఈ కణితి 550 గ్రాముల బరువు ఉందని, వైద్య పరిభాషలో దీనిని రిట్రోపెరిటోనియల్ టెరటోమాగా పేర్కొంటారన్నారు. ఇది చాలా అరుదైన కణితి అని, లక్ష మందిలో ఒకరికి మాత్రమే ఇలాంటి కణితులు ఏర్పడతాయని తెలిపారు.

# తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ విజయ



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు(అర్బన్): పుట్టిన గంటలోపు బిడ్డలకు ఇచ్చే ముర్రు పాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ పీడీ పి.విజయ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 88.6 శాతం ప్రసవాలు ఆసుపత్రుల్లో జరుగుతున్నప్పటికీ పుట్టిన గంటలోపు ముర్రుపాలు ఇచ్చే తల్లులు 41.8 శాతం ఉండటం బాధాకరమన్నారు. ముర్రుపాలను ఇవ్వడం వల్ల గర్భాశయ, అండాశయ క్యాన్సర్ల బారిన పడకుండా రక్షించుకోగలమన్నారు. ఈ నెల 1 నుంచి 7వ తేది వరకు ప్రతి రోజు అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో కార్యాక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓలు వరలక్ష్మి, అనురాధ, నరసమ్మ, రాజేశ్వరి, సపరున్నీసా బేగం, నోడల్ ఆఫీసర్ రేవతి జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ముర్రు పాలు అమృతంతో సమానం**

కర్నూలు(హాస్పిటల్): బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్న సంస్కృతిని ప్రోత్సహించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిపాలతో తల్లికి, బిడ్డకు కలిగే ఆవశ్యకత గురించి వివరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

### మైనర్లకు రక్షణకే పోక్సో చట్టం

కర్నూలు(హాస్పిటల్): పోక్సో చట్టానికి లింగ బేధం లేదని, మైనర్లకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకే ఈ చట్టం ఏర్పాటైందని కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ సుధాకుమారి చెప్పారు. శుక్రవారం కేఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో అకడమిక్ యాక్టివిటీలో భాగంగా ప్రణతి, పార్వతి పోక్సో చట్టంపై పీపీటీ ద్వారా వివరించారు. 2012లో ఈ చట్టం అమల్లోకి వచ్చిందని, 18 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లల కు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందని చెప్పారు. బాలబాలికలతో పాటు థర్డ్ జెండర్ మైనర్లకు కూడా ఈ చట్టం వర్తిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సింధియా శుభప్రద తదితరులు పాల్గొన్నారు.

### పోలీసు కానిస్టేబుల్ ఫలితాల్లో ఎస్‌వీఆర్ ప్రభంజనం

కర్నూలు సిటీ: పోలీసు కానిస్టేబుల్ ఫలితాల్లో నగరంలోని ఎస్‌వీఆర్ కోచింగ్ సెంటర్ ప్రభంజనం సృష్టించినట్లు డైరెక్టర్ వెంకట్రామి రెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తమ అభ్యర్థులు 140 మందికిపైగా ఉద్యోగాలు సాధించారన్నారు. ఎం.వెంకటరమణ 153 మార్కులు, బి.రవికుమార్ – 151, సునీల్ – 149, పవన్‌కళ్యాణ్ – 147, ఎం.లిఖిత – 141, షైనాష్ – 116, లక్ష్మీ – 123 అత్యధిక మార్కులు సాధించారన్నారు. శారీరక పరీక్షలకు ప్రత్యేక ట్రైనర్స్‌తో సాధన చేయిస్తామన్నారు. అనుభవం ఉన్న ఫ్యాకల్టీ వల్లే అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు.

# అటవీ సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న కర్నూలు అటవీ శాఖ కన్జర్వేటర్ యశోదాబాయి

కర్నూలు కల్చరల్: అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని, అమ్మపేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటాలని అటవీ శాఖ కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆర్.యశోదాబాయి అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా అటవీ శాఖ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సోషల్ ఫారెస్ట్ వెంగన్న బావి నర్సరీలో సుమారు 4 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. డీఎఫ్ఓ పి.శ్యామల, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో రవిశంకర్, కర్నూలు, ఆదోని ఎఫ్ఆర్‌వోలు జి.విజయకుమార్, పి.తేజశ్విని తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో చేరిన డీఎస్పీ



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలిసిన డీఎస్పీ ఉపేంద్రబాబు

కర్నూలు: కర్నూలు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా నియమితులైన ఎం.ఉపేంద్రబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడున్న శ్రీనివాసాచారిని గుంతకల్లు రైల్వే విభాగానికి బదిలీ చేసి ఎమ్మిగనూరు డీఎస్పీగా పనిచేస్తున్న ఉపేంద్రబాబును మహిళా పీఎస్‌కు నియమిస్తూ వారం రోజుల క్రితం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం పట్టణానికి చెందిన ఉపేంద్రబాబు 1995లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. 2008లో సీఐగా, 2024 జనవరిలో డీఎస్పీగా పదోన్నతి పొందారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నేరాలను అరికట్టేందుకు కృషి చేస్తానన్నారు. శక్తి యాప్, శక్తి వాట్సాప్, మహిళా చట్టాలపై కళాశాలలు, పాఠశాలల్లో మహిళల భద్రతే లక్ష్యంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

### స్పౌజ్ పింఛన్లలో నిరాశే!

- ఉమ్మడి జిల్లాలో 2 వేల మంది మహిళలకు మొండి చెయ్యి
- ఇంటి దగ్గర పింఛన్ పంపిణీ ఒట్టిదే

కర్నూలు (అగ్రికల్చర్): స్పౌజ్ పింఛన్ల మంజూరులో వందలాది వితంతు మహిళలకు అన్యాయం జరిగింది. రెండు నెలలుగా వేలాది మంది మహిళలకు స్పౌజ్ పింఛన్లు మంజూరు చేస్తున్నామంటూ హడావుడి చేస్తున్నా కొందరికే పరిమితం కావడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. మంజూరైన మహిళలకు కూడా జూన్, జులై నెల అరియర్స్ లేకుండానే ఆగస్టు నెల పింఛన్ మాత్రమే చేయడం పట్ల మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 3,527, నంద్యాల జిల్లాలో 3,630 మంది మహిళలకు స్పౌజ్ కింద వితంతు పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 వేల మంది మహిళలకు కూటమి ప్రభుత్వం మొండి చెయ్యి చూపింది. 14 నెలల కాలంలో ఒక్క కొత్త పింఛన్ ఇవ్వకపోగా వృద్ధాప్య పింఛన్ తీసుకుంటూ మరణించిన భర్తల స్థానంలో వారి భార్యలకు వితంతు పింఛన్ మంజూరు చేసి కొత్త పింఛన్లుగా ప్రచారం చేసుకోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాకు రాలేదు.. మాకు రాలేదంటూ మహిళలు సచివాలయాలకు వస్తున్నారు. స్పౌజ్ పింఛన్లను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పంపిణీ చేశారు. పలు చోట్ల టీడీపీ నేతలు కూడా పంపిణీ చేయడం గమనార్హం. కాగా ఆగస్టు నెల పింఛన్ల పంపిణీ అస్తవ్యస్థమైంది. ఇంటి వద్ద పింఛన్ల పంపిణీ నామమాత్రానికే పరిమితమైంది. కర్నూలు జిల్లాలో 2,39,480 మంది ఉండగా 2,25,598 మందికి (94.2 శాతం) పింఛన్లు పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,15,688 మంది ఉండగా 2,02,553 మందికి (93.91 శాతం) పింఛన్లు పంపిణీ చేశారు.

### నేడు నగరపాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్): నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో శనివారం నగరపాలక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, 19 అంశాలపై పాలకవర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంటుందని వెల్లడించారు.

## స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా 5న ఆందోళనలు

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీన చేపట్టే ఆందోళనలను విజయవంతం చేయాలని సీఐటీయూ న్యూసిటీ, ఓల్డ్‌సిటీ కమిటీల కార్యదర్శులు ఎస్.నరసింహులు, విజయ రామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపు మేరకు సీఐటీయూ న్యూసిటీ, ఓల్డ్‌సిటీ కమిటీల ఆధ్వర్యంలో కార్మికులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 5వ తేదీన చేపట్టే ఆందోళనల్లో విద్యుత్ కార్యాలయాలను దిగ్బంధం చేయాలని పిలుపునిచ్చారు. స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా చేపట్టే ఆందోళనలకు ప్రజా సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. టీడీపీ నాయకుడు నారా లోకేష్ స్మార్ట్‌మీటర్లను పెడితే పగలగొట్టాలని చెప్పి ఇప్పుడు కిమ్మనకుండా ఉండడం అన్యాయమని మండిపడ్డారు.

### స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం



నిర్మాణ వ్యర్థాల సేకరణను ప్రారంభిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగర ప్రజల సహకారంతో స్వచ్ఛ నగరాన్ని సాధిస్తామని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక యూకాన్ ప్లాజా వద్ద నిర్మాణపు వ్యర్థాల సేకరణను కమిషనర్ ప్రారంభించారు. అలాగే రాజ్‌విహార్ సమీపంలోని హంద్రీ ఒడ్డున ఎల్లమ్మ గుడి నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు నిర్మాణంలో ఉన్న బండ్ రహదారిని నగరపాలక, జలవనరుల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర పరిధిలో ఎక్కడైనా నిర్మాణ రంగ వ్యర్థాలుంటే యజమానులు 91000 30250 నంబర్‌ను ఫోన్ చేసి తెలియజేస్తే వాటిని సేకరిస్తామని ట్రాక్టర్‌కు రూ.500, టిప్పర్‌కు రూ.వెయ్యి చొప్పున రవాణా చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.